## న్యాయమూర్తులను కలిసిన ఏసిపి బాలాజీ



గజ్వేల్, ఫిబ్రవరి 20(ప్రభాతవార్త): గజ్వేల్ ఏసిపి బాలాజీ మంగళవారం గజ్వేల్ కోర్టును సందర్శించి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి. సౌమ్య, అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంకలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసుల గురించి, వచ్చే నెల 9న జరిగే లోక్‌అదాలత్ గురించి చర్చించారు. అనంతరం గజ్వేల్ బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు ఎదురుగా ఉన్న రోడ్డులో వాహనాలు వేగంగా వస్తున్నాయని, గతంలో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయని ఏసిపి దృష్టికి తీసుకువచ్చారు. బార్ అసోసియేషన్ కోరికమేరకు స్పీడ్‌బ్రేకర్ల గురించి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

చేర్యాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : గుర్తు తెలియన వ్యక్తులు రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చొరబడి సొత్తును దొంగలించిన సంఘటన చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముస్త్యాల గ్రామంలో జరిగింది. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి సామల రామస్వామి ఈనెల 16న కుటుంబ సమేతంగా షిరిడి దేవస్థానము వెళ్ళారు. మరుసటి రోజు సాయంత్రం రామస్వామి ఇంటి పక్కన ఉన్న తాటిపాముల స్రవంతి గమనించి మీ ఇంటివి, షటరు తాళాలు పగళగొట్టి ఉన్నాయని ఫోన్ ద్వారా తెలుపగా అదే గ్రామంలో ఉంటున్న రామస్వామి అన్నకుమాడికి సమాచారం ఇవ్వడంతో ఇంట్లోకి వెళ్ళి చూసేసరికి వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయని గమనించి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడ్డారని కుటుంబ సభ్యులకు తెలపగా షిరిడి నుండి మంగళవారం తిరిగొచ్చి ఇంట్లో దొంగలించబడిన సొత్తు, నగదుతో కలిపి మొత్తం. 24వేల విలువ ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేస్తున్న స్టాఫ్ నర్సులు

### ఔట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను వెంటనే

## విధుల్లోకి తీసుకోవాలి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

తొలగించిన ప్రభుత్వఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ స్టాఫ్‌నర్సులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదారాబాద్ లోని ప్రజాభవన్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నోడల్ అధికారి దివ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రాణాలు తెగించి ప్రజలకు సేవలు అందించిన ఔట్ సోర్సింగ్ స్టాఫ్‌నర్సులను క్రమబద్ధీకరణ చేయకుండా విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ప్రజాభవన్ నోడల్ అధికారి దివ్య సమస్యను రాష్ట్రప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు స ంపత్, రాజ్‌కుమార్, ముకన్య, బాలస్వామి, తార, గీత,శ్వేత, బాలలక్ష్మి, వనజ పాల్గొన్నారు.

## భక్తులు పోలీసుల సూచనలు పాటించాలి

### ఎసిపి వాసాల సతీష్



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎసిపి వాసాల సతీష్

హుస్నాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : హుస్నాబాద్ అక్కన్నపేట మండలాలలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తులు పోలీసుల సలహాలు,సూచనలు పాటించాలని హుస్నాబాద్ ఎసిపి వాసాల సతీష్,సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎర్రల కిరణ్‌లు అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణ శివారుతో పాటు అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి గ్రామాలలో జాతర జరిగే ప్రదేశాలను స్థానిక ఎస్ఐలు తోట మహేష్,తాండ్ర వివేక్‌లతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 8 ప్రదేశాలలో సమ్మక్క సారక్క జాతర జరుగుతుందని,జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు నిర్వాహకులు కల్పించారన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ప్రతీ ఒక్కరు ఖచ్చితంగా పోలీసుల సూచనలు పాటిస్తూ జాతర విజయవంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ నిర్వాహకులతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు సమస్యలపై ఉద్యమించాలి

### ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు అశాలత





మాట్లాడుతున్న ఆశాలత

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) కేంద్ర కమిటీ సభ్యురాలు కె.అశాలత మహిళలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఐద్వా జిల్లా విస్తృత సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని దీంతో కనీసం రెండు పూటల తిండికి కూడా దూరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దేశంలో మహిళలపై రోజు రోజుకూ దాడులు,హత్యలు, అత్యాచారాలు, గృహహింస పెరిగి పోతున్నాయన్నారు. వీటిని అరికట్టాల్సిన పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఐద్వా ప్రతినిధులు అత్తిని బాలిగపు శిరీష, శోభ,విఘ్నేశ్వరీ, నక్క పద్మ, దాసరి పద్మ, కనకవ్వ, రేవతి, భాగ్యలక్ష్మి, జయశ్రీ, ఉపేంద్ర, వరలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

## ఇసుక, మట్టికి ఆన్‌లైన్‌లో అనుమతి...

### తహసీల్దార్ శ్రీనివాస్

మెదక్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : ఇసుక, మట్టి అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మెదక్ తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అక్రమ ఇసుక, మట్టి తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. అయితే ఇంటి నిర్మాణం కోసం ప్రజల నుంచి ఇసుక, మట్టి కోసం విజ్ఞప్తులు వస్తున్నట్లు చెప్పారు. ఇంటి నిర్మాణంకోసం ఇసుక అవసరం ఉన్నవారు మైనింగ్ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతికి చెందిన వారు ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న అనుమతి పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తును పరిశీలించి వారికి ఇసుక కోసం దగ్గరలో ఉన్న ప్రాంతంలో అనుమతి ఇస్తామని అన్నారు. అలాగే మట్టి అవసరం ఉన్నవారు కూడా పట్టా భూమి తోపాటు ఎక్కడనుంచి మట్టి తరలిస్తారు అనే వివరాలతో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమతులు ఇస్తామని తెలిపారు. వ్యాపా రులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రజల అవసరాల మేరకు అనుమ తులు ఇస్తామని తెలిపారు. అక్రమ ఇసుక, మట్టి వ్యాపారంపై ఉక్కుపా దం మోపుతున్నట్లు వివరించారు. మెదక్ పట్టణం, మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సీజ్ చేసినట్లు చెప్పారు. ఇసుక కొరతపై ఆందోళన అవసరం లేదని, దరఖాస్తు ఇచ్చిన వెంటనే అనుమతులు ఇస్తామని తెలిపారు.

## ఎత్తిపోతల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

రాయికోడ్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

రైతులు పార్టీలకు అతీతంగా సంఘంగా ఏర్పడి ఎత్తిపోతల పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ డివిజన్ పరిధిలోని రాయికోడ్ మండలంలోని సింగితం గ్రామంలో రెండున్నర కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. రెండు కోట్ల పదహారు లక్షలతో బొగులంపల్లిలో ఎత్తిపోతల పథకం అదనపు గ్రామిలీ కెనాలన పనులను, 30 లక్షలతో బొగులంపల్లి ప్రాజెక్టు మెటల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు.

మండలంలోని కర్చల్, యూసుఫ్‌పూర్, ధర్మాపూర్, అల్లాపూర్ గ్రామాల్లో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ త్వరలో బుదేరా నుంచి సిరూర్ వరకు రెండు లైన్‌ల ఆర్‌ఆండ్‌బి రోడ్డు ఏర్పాటు పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అల్లపూర్ నుంచి షంశొద్దిన్‌పూర్ వరకు 70 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. రాయికోడ్‌లోని మోడల్ స్కూల్ వద్ద సిసి రోడ్డు నిర్మాణానికి, మార్కెట్ కమిటి నిధులతో చేపట్టనున్న మెటల్ రోడ్డు నిర్మాణానికి, రాయికోడ్ చౌరస్తా వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

రాయికోడ్‌లోని మోడల్ స్కూల్ విద్యార్థులతో మంత్రి ప్రత్యేకంగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిషత్ సిఈఓ జానకిరెడ్డి, ఎస్ఈ ఇరిగేష్ ములళీధర్, డిఎంహెచ్ఓ గాయత్రి, జహీరాబాద్ ఆర్‌డిఓ రాజు, ఎంపిపి లతా, జడ్పిటిసి సభ్యులు మల్లికార్జున్, ప్రిన్సిపల్ రజిని కుమారి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై

## ఐఐటిహెచ్ క్యాంపస్‌ను జాతికి అంకితం చేసిన ప్రధాని నరేంద్రమోదీ

సంగారెడ్డి మున్సిపాలిటి ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:

నూతన సాంకేతిక ఆవిష్కరణలలో ఐఐటిహెచ్ ఎన్నో మైళురాళ్ళను ఆదిగమించిందని గవర్నర్ తమిళిసై అన్నారు. సంగారెడ్డి సమీపంలోని ఐఐటిహెచ్ పరివర్తనాత్మక క్యాంపస్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను మంగళవారం ప్రధానమంత్రి నరేంద్రమోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతికి అంకితం చేశారు. ఐఐటిహెచ్ లో నిర్వహించిన కార్యాక్రమంలో గవర్నర్ తమిళిసై ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఐఐటిహెచ్ ఇంజనీరింగ్‌లో టాప్ 8ర్యాంక్‌తో, ఎన్ఐఆర్ఎఫ్2023 ద్వారా టాప్ 3ర్యాంక్ సాధించిదని అన్నారు. ఇన్నోవేషన్‌తో టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్‌లో అత్యుత్తమంగా ప్రసిద్ధి చెందిందని అన్నారు. వికసిత్ భారత్ కార్యాక్రమంలో మరిన్ని విజయవంతమైన కార్యక్రమాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. దేశంలోని విధ్యాసంస్థల ద్వారా పోందిన అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో,దేశానికి తిరిగి సహకారం అందించాలని విధ్యార్థులను కోరారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్,చైర్మేన్ డాక్టర్ బివిఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ క్యాంపస్‌ను దేశానికి అంకితం చేయడం ఆకాడమిక్ ఎక్స్‌లెన్స్ మరియు ఇన్నోవెషన్‌కు తిరుగులేని నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. దేశంలోని విధ్యాసంస్థలకు కొత్త ప్రమాణాలను నిర్ధేశిస్తుందని భవిష్యత్తులో టాప్ 100గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్‌గా నిలవాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. డైరెక్టర్ ప్రోఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ క్యాంపస్ జాతికి అంకితం చేయడం ఐఐటిహెచ్ కమ్యూనిటికి గర్వించదగిన క్షణమని అన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై జ్యోతి ప్రజ్వలన చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని అథితులు వీక్షించారు.

### హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మెంబర్‌గా రాజు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : సిద్దిపేట పట్టణానికి చెందిన రాజబోయిన రాజు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మెంబర్‌గా ఎన్ని కయ్యారు. ఈ మేరకు మంగళవారం కౌన్సిల్ మెంబర్‌గా నియామకం పత్రం అందుకున్నట్లు రాజు తెలిపారు. ఎవరికి ఎలాంటి సమస్యల వచ్చినా..పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. హ్యూమన్ కౌన్సిల్లో మెంబర్‌గా అవకాశం కల్పించినందుకు కౌన్సిల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలంటూ

## ఎబివిపి ఆధ్వర్యంలో ధర్నా

రామాయంపేట మున్సిపాలిటీ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బండారి ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమండ్ చేశారు. స్కాలర్‌షిప్స్ విద్యార్థుల భిక్ష కాదని, అది విద్యార్థుల హక్కు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను ప్రభుత్వం విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నారని అన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడం అంటే పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని అన్నారు. రాష్ట్రంలో రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రాక ప్రైవేటు ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను జలగలాగ పీడిస్తూ, మానసిక క్షోభకు గురిచేయడం కారణంగా తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ నడిబొడ్డున మిగతా జిల్లాల్లో విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకోవడం జరిగింది అన్నారు. ఈ ఆత్మహత్యలు అన్ని ప్రభుత్వ హత్యలేని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మా ప్రభుత్వం రాగానే మొట్టమొదటగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌లు విడుదల చేస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మొద్దునిద్ర వీడి విద్యార్థులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను చదువుకు దూరం కాకుండా చూడాలన్నారు. ఫీజురియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయకపోతే రానున్న రోజులలో సెక్రటేరియట్, ముఖ్యమంత్రి ఇల్లు ముట్టడించైనా, ప్రభుత్వ మెడలు వంచైనా విద్యార్థులకు న్యాయం చేసేంతవరకు ఏబీవీపీ పోరాడుతుంది అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు నరేష్, సాయి, భరత్ రోహిత్, మధు, భాను, దినేష్‌తో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్న ఏబీవీపీ కార్యకర్తలు

## సమ్మక్క-సారలమ్మ జాతరకు ముస్తాబైన 'అక్కెనపల్లి'

◆ నేటినుంచి మూడురోజులపాటు ఉత్సవాలు ◆ 40 ఏళ్లుగా కొనసాగుతున్న జాతర ◆ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నంగునూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :

రెండేళ్లకోసారి వచ్చే సమ్మక్క-సారలమ్మ జాతరకు మండలపరిధిలోని అక్కెనపల్లి గ్రామం ముస్తాబైంది. మేడారంలో జరిగే జాతరలాగానే అదే ముహుర్తానికి ఇక్కడి గ్రామంలోను సమ్మక్క-సారలమ్మ జాతరను నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. సుమారు 40 ఏళ్లుగా ఈ జాతర నిర్వహిస్తున్నారు. మేడారం వెళ్లలేని భక్తులకు సౌకార్యర్థం ఇక్కడ మొక్కులు తీర్చుకునేలా సమ్మక్క-సారక్క గద్దెలను తీర్చిదిద్దారు. భక్తులు కోరుకున్న కోరికలు నెరవేరడంతో ఇక్కడి అమ్మవార్లను దర్శించుకునేందుకు మండలంలోని భక్తులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. జాతరలో భక్తులు మొక్కులను తీర్చుకునేందుకు వారి నిలువెత్తు బంగారు(బెల్లం) సమర్పించి ఒడి బియ్యం పోసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈనెల 21 నుంచి 23 వరకు జరిగే ఈ ఉత్సవాలను వీక్షించేందుకు ఏర్పాట్లను పూర్తి చేయడంతో అక్కెనపల్లి గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం సారలమ్మను, గురువారం సమ్మక్కను గద్దెకు తీసుకువచ్చే కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించనున్నారు. శుక్రవారం భక్తులు ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకోనున్నారు. శనివారం అమ్మవార్లు వన ప్రవేశం చేయనున్నారు. రాత్రి వేళల్లో ఒగ్గు కథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతాయి.

**మేడారం వెళ్లలేని భక్తుల సౌకార్యర్థం...**

రెండేళ్లకు ఒకసారి జరిగే మేడారం జాతరకు వెళ్లలేని భక్తులకు అక్కెనపల్లి సమ్మక్క-సారక్క జాతర ఎంతగానో సౌకర్యార్థంగా ఉంటుంది. మేడారంలో జరిగే సమయానికే ఇక్కడ జాతరను నిర్వహించడంతో చాలామంది భక్తులు ఇక్కడే మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులు వారి నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించి అమ్మవార్లకు ఒడి బియ్యం పోసి పూజలు నిర్వహిస్తారు. సమ్మక్క-సారలమ్మలను గద్దెల వద్దకు వచ్చే సమయంలో గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో శివసత్తుల పూనకలతో గద్దెలవరకు వచ్చి మేకలను బలిచ్చి బంధవులతో కలిసి వేడుకగా జరుపుకుంటారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి సహపక్తి భోజనాలు చేసి ఇంటికి తిరుగు ప్రయాణం అవుతారు.



జాతరకు ముస్తాబైన సమ్మక్క-సారలమ్మలు

**జాతరకు బీజం పడింది ఇలా...**

నంగునురు మండలం అక్కెనపల్లి గ్రామ శివారు లోగల పులిగుండ్ల సమీపంలో 40 ఏళ్ల కిందట ఓ గొర్రెల కాపరి మేకలను మేపుతుండగా పెద్ద గుండు ప్రాంతంలో పసుపు, కుంకుమ ముద్దలు కనిపించాయి. ఈ విషయం గ్రామస్థులకు తెలియగానే అక్కడికి తండోప తండాలుగా తరలివచ్చి పరిసరాలను పరిశీలించారు. మేడారంలో సమ్మక్క-సారక్క జాతర కొన్ని రోజుల ముందే ఈ ప్రాంతంలో పసుపు, కుంకుమ ముద్దలు కనిపించాయని అమ్మవార్ల మహిమతోనే పసుపు, కుంకుమ కనిపించాయని రెండెళ్లకోసారి గ్రామంలో జాతర జరిపించాలని పూనకం వచ్చిన ఓ మహిళ చెప్పింది.

దీంతో ఆమె మాటలపై గ్రామస్థు లకు నమ్మకం ఏర్పడింది. సమ్మక్క తల్లి పులి పైన స్వారీ చేస్తుందని అందుకే గ్రామంలోని పులిగుండ్ల వద్ద పసుపు రూపంగా దర్శన మిచ్చిందని గ్రామస్థు లకు నమ్మకం కలిగింది. దీంతో గ్రామంలోని ఆలయ నిర్మాణం చేపట్టాలని సంకల్పించారు. ఈ సమయంలో చందాలు వేసుకొని పులిగుండ్ల సమీపంలో 14 ఎకరాల స్థలాన్ని సేకరించి 1984లో సమ్మక్క-సారక్క గద్దెలు వారి మేనకోడలు లక్ష్మి, పగిడిద్దరాజు (నాగు పాము) ప్రతిమలను ప్రతిష్టించారు. అప్పటినుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మేడారంలో నిర్వహించే ముహుర్తానికి జాతరను నిర్వహించడం సమ్మక్క-సారలమ్మలు గద్దెనెక్కడం భక్తులు మొక్కులు తీర్చుకోవడం అనవాయితీగా మారిపోయింది.





ఏసిపి బాలాజీని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

## ఏసిపి బాలాజీకి సన్మానం

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త): గజ్వేల్ డివిజన్ నూతన ఏసిపిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఏ.బాలాజీని మంగళవారం ప్రజ్ఞాపూర్‌లోని ఏసిపి కార్యాలయంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి.రాజమౌళి కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఏసిపిని కలిసిన వారిలో కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్య, పంబాల అర్చన శివకుమార్, ఎంఏ.రహీం, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, శీర్ల శ్యామల మల్లేశం తదితరులు ఉన్నారు.

### పేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ములుగు, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త): సామాజిక సేవే లక్ష్యంగా రోటరీ క్లబ్ ముందుకు సాగుతుందని, ఎంతో మంది బడుగు బలహీన వర్గాలకు చేయూతనందిస్తూ అండగా నిలుస్తుందని గజ్వేల్ ఏసిపి బాలాజీ, రొటేరియన్ డాక్టర్ వడ్లమని రవిలు పేర్కొన్నారు. మంగళవారం రోటరీ క్లబ్ గజ్వేల్ అధ్యక్షుడు కుక్కల బాబుగౌడ్ ఆధ్వర్యంలో ములుగు మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి వద్ద గల విపిజె ఫంక్షన్‌హాల్‌లో 150 మంది పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ ఏసిపి బాలాజీ, రొటేరియన్ డాక్టర్ వడ్లమని రవిలు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు వంటిమామిడి చెక్‌పోస్ట్ నుండి ఫంక్షన్ హాల్ వరకు బైక్, కార్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి బాలాజీ, రొటేరియన్ డాక్టర్ వడ్లమని రవిలు మాట్లాడుతూ ఇంతటి మహత్తరమైన కార్యక్రమాన్ని మంచి హృదయాలతో చేపట్టిన రోటరీ సభ్యులను అభినందించారు. ఇప్పటికే రోటరీ క్లబ్ ద్వారా ఎంతో మంది పేదలు లబ్ధిపొందారని అన్నారు. ఈ రోటరీ క్లబ్ మరింత బలపడి సామాజిక సేవలో ముందుండి ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలవాలని వారు సూచించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. క్లబ్‌లోని సభ్యులంతా ఎప్పుడు ఎవరికి ఏ ఆపద వచ్చినా అందుబాటులో ఉంటూ వెంటనే స్పందించి సహకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సభ్యుల సహకా రం ఉంటే ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడతామని అన్నారు. అనంతరం రోటరీ క్లబ్ సభ్యులందరినీ శాలువాలతో ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో సెక్రటరీ నరసింహారెడ్డి, ట్రెజరర్ శ్రీనివాస్‌గౌడ్, అట్రాక్టివ్ చైర్మన్ చంటి,వాటర్ అండ్ శానిటేషన్ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, జగదీశ్వర్, ఎంపిటిసి హరిబాబు, కడపల నరసింహారెడ్డి, సందుగారి నర్సింహారెడ్డి, బాపురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కుక్కల నరేష్‌గౌడ్, జగదీశ్వర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, విష్ణుజగతి, రోటరీక్లబ్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పెండింగ్‌లో ఉన్న కేసులపై ఏసిపి సమీక్షా సమావేశం

గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త): పారదర్శకంగా కేసుల దర్యాప్తు ఉండాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని గజ్వేల్ ఏసిపి బాలాజీ సూచించారు. మంగళవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు కేసులను పెండింగ్‌లో ఉంచకుండా చూడాలన్నారు. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, మహిళలకు సంబంధించిన కేసులలో ఎలాంటి జాప్యం లేకుండా 60 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. సైబర్ నేరాల గురించి మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా జరుగకుండా నిరంతరం నిఘా పెంచాలని తెలిపారు. నేరస్తులకు శిక్షలు పడేవిధంగా కేసుల ఇన్వెస్టిగేషన్ ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, తొగుట ఇన్‌స్పెక్టర్ లతీఫ్, తొగుట ఎస్ఐ లింగం, బేగంపేట ఎస్ఐ రవికాంత్‌రావు, ములుగు ఎస్ఐ విజయ్, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు తదితరులు ఉన్నారు.

### పదో తరగతి ఫలితాల్లో జిల్లాను

## రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలి

### జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేలా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయా లని జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజాశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం 3వ, 2వ, 4వ గ్రామీణ స్థాయి సంఘ సమావేశాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎరువుల కొరత రాకుండా చూడాలన్నారు. చిన్నకోడూరు మండంలో జరిగిన ఐనా దాడికి 18 దూడలు మృతి చెందాయని వాటికి సంబంధించి బీమా చెల్లింపులు వెంటనే పూర్తి చేయా లని అధికారులను ఆదేశించారు. మేడారం సమ్మక్క-సారక్క జాతర ఉత్సవా లలో ప్లాస్టిక్ రహితంగా చేసుకునే విధంగా శ్రద్ధ చూపాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి తగ్గించాలన్నారు. అన్ని వర్గాల రైతులకు డ్రిప్‌లు అందించే విధంగా చొరవ తీసుకోవాలని ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి త్వరగా తేవాలన్నారు. పౌరసర ఫరాశాఖలో ఖాళీగా ఉన్న 15 చౌక ధరల దుకాణాలు కొత్తగా కేటాయించినటువంటి మూడు దుకాణాలకు అర్హత కలిగిన అభ్యర్థులను గుర్తించి డీలర్ షిప్ కేటాయించాల న్నారు. ఉపాధి హామీ పథకంలో ఏప్రిల్ 1 నుంచి వంద రోజుల పనులు ప్రారంభించాలన్నారు. పశువులకు వైద్య పరీక్షల నిర్వహణ కోసం ట్రేవీస్‌లకు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేయాలని తీర్మాణం చేశారు. సమావేశాలలో ఎమ్మెల్సీ డా॥ యాదవరెడ్డి, జడ్పీటిసిలు, అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు ఇటీవల అనారోగ్యంతో మరణించిన జడ్పీ డిప్యూటీ సీఈవో సుమతికి సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.



స్థాయి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రోజాశర్మ

## ఉద్యోగానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



నేరేడ్‌మెట్ ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓల్డ్ సఫిల్‌గూడ ప్రాంతానికి చెందిన కార్తిక్ (21), భార్య సుస్మితతో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీనా ఉదయం ఉద్యోగానికి వెళ్ళిన కార్తిక్ సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య సుస్మిత తెలిసిన, బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకి తెలియకపోవడంతో నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

### బోర్ నీటిపై పన్నులు విధించకూడదు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: బోర్ నీటికి పన్ను విధించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని 5వ వార్డుకు చెందిన సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త మంగళవారం సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నివాసం ఉంటున్న ప్రజలకు బోర్ నీటికి మీటర్లు పెట్టి పన్నులు వసూల్ చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కరసేవలకు శివాజీ పురస్కారాలు



కరసేవకులకు ఛత్రపతి శివాజీ పురస్కారాలు ప్రదానం చేస్తున్న ప్రతినిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:భాగ్యనగర్ ఛత్రపతి శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో నాడు అయోధ్య కరసేవలో పాల్గొన్న వారికి మంగళవారం నాడిక్కడ శివాజీ సేవా పురస్కారాల మహోత్సవం జరిగింది. కరసేవకుడు, రామభక్తుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, చింతల పుష్పలత దంపతులను శివాజీ ఫౌండేషన్ ప్రతినిధులు టి.కృష్ణమూర్తి, కొలను శంకర్‌రెడ్డిలు శాలువలతో సత్కరించి, జ్ఞాపికలను అంద జేశారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ మాట్లాడుతూ 1989 నుంచి జరిగిన రామజన్మభూమికి సంబంధించిన అన్ని ఉద్యమాలలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. వేలాది మంది కరసేవకుల త్యాగాలు, లక్షలాది మంది రామభక్తుల పోరాటం తరువాత అయిదు శతాబ్దాల కల ప్రధాని నరేంద్రమోదీ వల్ల రామమందిరం నిర్మాణం సాకారం అయ్యిందన్నారు. రామమందిరం నిర్మాణంలో కరసేవకుల్లో తాను కూడా ఒక భాగస్వామిని కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు.

### జిహెచ్ఎంసి సర్కిల్ 14 డిఎంసిగా విద్యాధర్



బేగంబజార్,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: మహానగర పాలక సంస్థ సర్కిల్ 14 డిప్యూటి మున్సిపల్ కమీషనర్‌గా విద్యాధర్ భాధ్యతలు చేపట్టారు.ఇక్కడ డిఎంసిగా కొనసాగిన బాలయ్య స్థానంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటి నుంచి వచ్చిన విద్యాధర్ గోషామహల్ నియోజకవర్గం మహానగర పాలక సంస్థ సర్కిల్ 14,డిప్యూటి కమీషనర్‌గా పదవి భాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అంతేకాకుండా కొత్త ఓటర్ల జాబితాను ప్రకటిస్తామన్నారు.గోషామహల్ నియోజకవర్గంలోని వ్యాపారులు,గృహ వినియోగదారులు కూడా మార్చి 31లోపు ప్రాపర్టీ ట్యాక్‌ను చెల్లించాలన్నారు.

### బాధితురాలికి సెల్‌ఫోన్ అందజేసిన సిఐ



బేగంబజార్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు సెల్‌ఫోన్లు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు కథనం ప్రకారం.. స్టేషన్ పరిధిలోని ముగ్గురు బాధితులు తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.సెల్‌ఫోన్ సిఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితుల సెల్‌ఫోన్లు కనుకొని మంగళవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు శ్రావణి, మౌనికలకు చెందిన సెల్‌ఫోన్లు ఇన్‌స్పెక్టర్ కె.ముత్తు సమక్షంలో ఎస్ఐ నరేష్,పోలీసు సిబ్బంది అందచేశారు. తమ సెల్‌ఫోన్లు ఇప్పించినందుకు బాధితులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### చార్మినార్ నూతన ఎసిపిగా ఎస్. సుదర్శన్



చార్మినార్,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త :చార్మినార్ కొత్త ఎసిపిగా ఎస్.సుదర్శన్ నియమితులయ్యారు.ఇక్కడ ఎసిపిగా పని చేసిన రుద్ర భాస్కర్ ఇంటిలిజెన్స్‌కు బదిలీ అయ్యారు.చార్మినార్ ఎసిపిగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ మాట్లాడుతూ అందరి సహకారంతో పాత బస్తీలో శాంతి భద్రతలు పరిరక్షణ కోసం తన శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.పాతబస్తీలోని కాలాపత్తర్,కామాటిపుర, చైతన్యపురితో పాటు పలు పోలీస్ స్టేషన్లలో సుదర్శన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. సిటి సెక్యూరిటీ వింగ్‌లో ఎసిపిగా విధులు నిర్వహిస్తున్న సుదర్శన్ చార్మినార్ ఎసిపిగా బదిలీపై వచ్చారు.

## దేశానికి నరేంద్రమోడీ అవసరం ఎంతైనా ఉంది

**ఈటెల రాజేందర్**



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఈటెల రాజేందర్

మూసాపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : గత రెండు రోజులుగా వివేకానంద డిగ్రీ కాలేజీలో జరుగుతున్న కల్చరల్ ఫెస్టివల్ విద్యార్థులలో పెద్ద ఎత్తున ఆనందాన్ని కలిగించింది. వారిలో ఉన్న సృజనాత్మకతను బయటకు తీసింది. సుమారు 30 డిగ్రీ కాలేజీల విద్యార్థులు పాల్గొన్న ఈ ఫెస్ట్‌లో ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని పారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వంలో ఉన్న పారదర్శకత దేశానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. ఈ భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలబెట్టే సత్తా ఉన్న ఏకైక నాయకుడు నరేంద్రమోడీ అని, కరోనా సమయంలో ఈ దేశాన్ని ప్రపంచ దేశాల్ని కాపాడింది ఈ దేశంలో సైంటిస్టులని వారందరికీ మంచి ఉత్సాహాన్ని ఇచ్చి వ్యాక్సిన్ కనుగొనడంలో భాతర ప్రభుత్వం యొక్క కృషిని ప్రోత్సాహాన్ని మరువలేమని అన్నారు. ఏసీపి శ్రీనివాసరావు మాట్లాడుతూ వివేకానంద డిగ్రీ కాలేజ్ ఎన్‌సిసి విద్యార్థులు సమాజానికి బాగా సేవ చేస్తున్నారని పూర్తి సమయం వెచ్చించి ప్రభుత్వానికి సహకరించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కొలదాల నరేష్, డైరెక్టర్ కెవి లావణ్య, ఆర్గనైజేషన్ డీన్ మౌనిక, ప్రిన్సిపల్ బి.ఎన్.రాజేష్, సంఘమిత్ర డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ మీరావలి, వనిత డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**నేటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా 'మాదిగల జోడో యాత్ర' ప్రారంభం**



వాల్ పోస్టర్లును ఆవిష్కరిస్తున్న గజ్జెల కాంతం, పిడమర్తి రవి

సైఫాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: తెలంగాణలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ 'మాదిగల జోడో యాత్ర' ఈ నెల 21వ తేదీ బుధవారం నుంచి చేపడతున్నామని తెలంగాణ ప్రజా సంఘాల జెఏసి ఛైర్మన్ గజ్జల కాంతం, మాదిగ జెఏసి వ్యవస్థాపక ఛైర్మన్ పిడమర్తి రవి తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లును ఈ మేరకు మంగళవారం ట్యాంక్ బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల పంతం–బిజెపి అంతం అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ యాత్ర 21వ తేదీన అమీర్‌పేట నుంచి ప్రారంభమై 29వ తేదీన వరంగల్‌లో ముగుస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా అత్యధికంగా ఉందని, అన్ని రంగాలలో ఎంతో వెనుకబడి దుర్భర దారిద్ర్య జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగలకు న్యాయం జరగాలంటే కేంద్ర ప్రభుత్వం 12 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. మూడు దశాబ్ధాలుగా ఎస్సీ రిజర్వేషన్‌కు వర్గీకరణ కోసం మాదిగలు తెలుగు రాష్ట్రాలలో ఉద్యమిస్తున్నారని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలను నిలువునా మోసం చేసిందని, ఎస్సీలకు రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచుతామని ప్రకటించి అన్యాయం చేసిందన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపి ఆరాటపడుతున్నదే తప్పా కోట్లాది మంది మాదిగల గురించి పట్టించుకోవడం లేదని వారు నిశితంగా విమర్శించారు. మాదిలపై బిజెపికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికలకు ముందే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రంలోని 17 లోకసభ స్థానాల్లో పోటిచేసి బిజెపికి డిపాజిట్లు దక్కకుండా చేస్తామని గజ్జల కాంతం, పిడమర్తి రవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గద్దం యాదన్న, ముత్యాపాక నర్సింగ్‌రావు, బోదల బాబురావు, చంద్రశేఖర్, మల్లేష్, దేవరకొండ నరేష్, డా.సంజీవ్‌నాయక్, శైలేందర్‌సింగ్, మహేష్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూలిన ప్రహరీగోడకు మరమ్మత్తులు చేపట్టాలి

**ఎమ్మెల్యే ముఠాగోపాల్**



దీన్‌దయాళ్‌నగర్‌లో కూలిన ప్రహరీగోడ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: అడిక్‌మెట్ డివిజన్‌లోని దీన్‌దయాళ్ నగర్‌లో కూలిన ప్రహరీగోడకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం ప్రహరీగోడ కూలిన ప్రదేశాన్ని బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహా, రాష్ట్ర నాయకులు మహ్మద్ జహంగీర్‌లతో కలిసి పరిశీలించారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన పునరుద్దరించే ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు అస్లామ్, ఖదీర్ మహ్మద్, జహంగీర్, గురుదీప్‌సింగ్ తదితరులున్నారు.

## పుస్తకాలు చదవడం ద్వారా ఎందరో ఉద్యోగాలు పొందారు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉండడం మూలంగా అన్ని పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న ఎందరో ఉద్యోగాలు పొందారని ఆ సంస్థ కార్యదర్శి పి.పద్మజ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల ప్రకటించిన స్కూల్‌లైబ్రేరియన్ పరీక్షల ఫలితాల్లో నగర కేంద్ర గ్రంథాలయ సంస్థలో చదివిన విద్యార్థి జి.కష్యప్ 'గురుకుల స్కూల్ లైబ్రేరియన్'గా ఉద్యోగం వచ్చినందుకుగాను మంగళవారం గ్రంథాలయం ఆవరణలో ఘనంగా సత్కరించే కార్యక్రమం జరిగింది. నగర కేంద్ర గ్రంథాలయంలో పుస్త కాలు చదవి ఉద్యోగం రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఇతర విద్యార్థినీ విద్యార్థులు ఇదే విధంగా ఏకాగ్రతతో, అంకితభావంతో చదివి పోటీపరీక్షల్లో నెగ్గి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం గ్రేడ్–1 లైబ్రేరియన్ మదన్మోహన్, గ్రేట్–2 లైబ్రేరియన్ వెంకటేశ్వర్‌రెడ్డి, అవినాష్, వెంకటేశ్‌యాదవ్, ముతయం, మహేశ్వరి, ఉమ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## వివక్షతలేని సమాజ నిర్మాణం కోసం పౌర సమాజం సన్నద్ధం కావాలి

**డిబిపి అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపు**



సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: వివక్షతలేని సమతా ప్రపంచాను నిర్మించడానికి పౌర సమాజం సమాయత్తం కావాలని ఇంటర్‌నేషనల్ సోషల్ జస్టిస్ ఫోరం (ఐఎస్‌జెఎఫ్) ఛైర్మన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపు నిచ్చారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నాడిక్కడ జాతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం లభించక పోతే దేశాలు, సమాజం మధ్య అంతర్యుద్ధం వస్తుందని ఈ మేరకు ఐక్య రాజ్య సమితి హెచ్చరిక చేసిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ఛైర్మన్ వి.ఎల్.రాజుఉ , పార్టీ నాయకులు బీరం సతీష్‌కుమార్, ఇటికాల గణేష్, జెఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచవ్యాప్తంగా కామర్స్ కోర్సుకు మంచి భవిష్యత్ ఉంది

**వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్**



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్,చిత్రంలో ప్రొ.చెన్నప్ప

తార్నాక, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: ప్రపంచవ్యాప్తంగా కామర్స్ కోర్సుకు మంచి భవిష్యత్ ఉందని ఓ.యూ వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. ఓయూ వాణిజ్య విభాగం యూజీ (బికాం) వార్షిక మేనేజ్మెంట్ కాన్ఫరెన్స్‌ను మంగళవారం ఓ.యూలోని కామర్స్ డిపార్ట్‌మెంట్‌లో హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్ యాదవ్ కామర్స్ విద్యలో అభివృద్ధి, బీకాం కోర్సుల ప్రాముఖ్యత పై కీలకోపన్యాసం చేశారు. అకాడమిక్ అడిట్ డైరెక్టర్ ప్రొ. బి.శ్రీనగేష్, వాణిజ్య విభాగం అధిపతి ప్రొ.డి. చెన్నప్ప మాట్లాడుతూ వాణిజ్య విద్య యొక్క ప్రస్తుత అసరాలు, ప్రాముఖ్యత గురించి చర్చించారు. ప్రొ.ఎం.గంగాధర్ కొత్తకోర్సుల ప్రవేశం,ఉన్నత విద్యారంగంలో అభివృద్ధి చెందుతున్న తీరు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.శ్రీరాములు, కన్వీనర్ ప్రొ.ఇంద్రకంటి శేఖర్,ప్రొఫెసర్లు సివి.రంజని, కవితాదేవి, జి.నరేష్ రెడ్డి, ప్యాట్రిక్, డా.శ్రీనివవాస్‌తో పాటు వివిద కళాశాల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా అమృతాలయ వార్షికోత్సవ వేడుకలు

కుత్బుల్లాపూర్,, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్‌నగర్‌లో వెలసిన అమృతాలయంలో తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, మహాలక్ష్మి,శ్రీ బ్రమరాంభికా సమేత శ్రీ మల్లికార్జునస్వామి లకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం భక్తులకు అన్నదానకార్యక్రమం పెద్దఎత్తున ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గణేష్‌నగర్ సంక్షేమ సంఘప్రతినిధులు, మాజీ కార్పొరేటర్ బొద్దు వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

### బృందావన్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మంగళవారం జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్,విద్యుత్ శాఖలకు చెందిన అధికారులతో కలిసి నియోజక వర్గం పరిధి లోని మైలార్‌దేవ్‌పల్లి ,బృందావన్ కాలనీ ప్రాంతాలలో పర్యటించారు. కాలనీలలో సిసి రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,విద్యుత్ దీపాలు ఏర్పాటు విషయమై బస్తీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రేమ్‌గౌడ్,యూత్ ప్రెసిడెంట్ రఘు యాదవ్,రాము యాదవ్,శ్రీనివాస్ గౌడ్,లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు.



దక్షిణ మధ్య రైల్వే సంఘ్ నేతలను కలిసిన కాంగ్రెస్ నేత వేణుగోపాల స్వామి

## ఎస్.సి. ఆర్.ఎంప్లాయిస్ సంఘ్ కాంగ్రెస్‌కు మద్ధతు : భరణి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎవరు పోటీ చేసిన వారికి సంపూర్ణ మద్ధతు తెలుపుతామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎం.భరణి భానుప్రసాద్ తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం ఆశిస్తున్న వేణుగోపాల స్వామి మంగళవారం సికింద్రా బాద్‌లోని ఎంప్లాయిస్ సంఘ్ సెంట్రల్ కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలిశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఆశిస్తున్నానని, తమకు మద్ధతు తెలుపాలని విజ్ఞప్తి చేశారు. తమకు మద్ధతు తెలుపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ్ నేతలు ప్రభురాజు, ప్రసాద్, చంద్రశేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### షాట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం

కంటోన్మెంట్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: షాట్‌సర్క్యూట్‌తో ఓ కారు దగ్ధమైన సంఘటన గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాప్ వద్ద ఓ కారులో ఇంజన్ భాగం నుంచి అకస్మాత్తుగా మంటలంటుకున్నాయి. గమనించిన డ్రైవర్ అప్రమత్తమై బయటికి వచ్చిన కొద్ది క్షణంలోనే కారు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఎగసి పడుతున్న మంటలను ఆర్పివేశారు.

## ఎమ్మెల్యే గాంధీ వెంటనే కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు క్షమాపణలు చెప్పాలి

**వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాషిపాక యాదగిరి**

వివేకానంద నగర్ కాలనీ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త : ప్రజా సమస్యలను ఏనాడు పట్టించుకోని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మంగళవారం వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాషిపాక యాదగిరి తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గతంలో తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచి టిఆర్ఎస్‌లోకి చేరి నేడు బిఆర్ఎస్ నుండి ఏ పార్టీలోకి వెళ్దామా అని దిక్కులు చూస్తున్నటువంటి మీరు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఇంకొక్కసారి కాంగ్రెస్ పార్టీ నాయకులను గానీ కార్యకర్తలను గానీ మీ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. వెంటనే గాంధీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు అందరికీ క్షమాపణలు చెప్పాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి గురికావల్సి వస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## రక్త దానం చేయటానికి యువత ముందుకు రావాలి



రక్త దాన శిబిరంలో పాల్గొన్న బిజెపి నాయకులు మెఘూరాణి అగర్వాల్, ఉమేష్ అగర్వాల్

చార్మినార్,ఫి బ్రవరి 20 ప్రభాతవార్త : యువత రక్త దానం చేయటానికి ముందుకు రావాలని చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం బిజెపి కంటెస్ట్ ఎమ్మెల్యే, సీనియర్ బిజెపి నాయకురాలు మెఘూరాణి అగర్వాల్ తెలిపారు.పాతబస్తీ ఘాన్సీ బజార్‌లోని పి.సత్యానారాయణలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెఘూరాణి అగర్వాల్ మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల మరో ప్రాణాన్ని రక్షించిన వారమవుతా మని తెలిపారు.తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీకి బ్లడ్‌ను అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ బిజెపి నాయకులు డాక్టర్.భగవంత్ రావు,పవన్ మిశ్ర,నరేష్ అవస్థి,ఉమేష్ సింగానియా, తరుణ్ అగర్వాల్,వేణు పాల్గొన్నారు.

### నేషనల్ కరాటేలో మెడల్ సాధించిన కుశాల్‌చారి

ముషీరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో మన హైదరాబాద్‌కు చెందిన కూరెల్లి కుశాల్ చారి మెడల్ సాధించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన కరాటే పోటీలలో పాల్గొన్న కుశాల్‌చారి స్పైరింగ్ పోటీలలో మెడల్ సాధించాడు.

## సిఖ్ సమాజ్‌లకు ఎల్లప్పుడు అండగా ఉంటా

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్**



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన అమీర్‌పేట్ గురుద్వార్ నూతన కార్యవర్గం

కంటోన్మెంట్,ఫిబ్రవరి 20 ప్రభాతవార్త: సిఖ్ సమాజ్‌లకు ఎల్లప్పుడు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అమీర్‌పేట్‌లోని గురుద్వార్ కమిటీకి ఎన్నికలు జరిగాయి. నూతన కార్యవర్గం మంగళవారం మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో కలిసి అభినందనలు తెలియజేశారు. అధ్యక్షులుగా దర్శన్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా సురేందర్‌లు ఎన్నికైనందుకు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుంచి సిఖ్ సోదరులకు అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. సిఖ్ వాడల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ శేషుకుమారి, సిఖ్ సమాజ్ ప్రతినిధులు టిల్లూ, సుమిత్ సింగ్, అజ్జు, లాహోర్ సింగ్ పాల్గొన్నారు.

## కొమరంభీం కాలనీ ఇంటి స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలి

**ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ**



మహా ధర్నా చేస్తున్న కొమరంభీం కాలనీ ఆదివాసీయులు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త: ఆదివాసీలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న కొమరంభీం కాలనీలోని ఇంటి స్థలాలకు పట్టాలు మంజూరు చేయాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ నాయకులు విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తుడుందెబ్బ పిలుపు పేరుతో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి సమితి అధ్యక్షులు మైపతి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మన దేశానికి స్వతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ పాలక ప్రభుత్వాలు ఆదివాసీల సమస్యలు పరిష్కరించటంలో విఫలమయ్యారని ఆరోపించారు. అనేక సంవత్సరాలుగా కొమరంభీం కాలనీలో ఆదివాసీలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ఇంటి స్థలాలకు ఇప్పటి వరకు పట్టాలు మంజూరు చేయలేదని అన్నారు. గొడం గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నా కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు కొడప్ప నగేష్, సాగబోయిన పాపారావు, హెచ్డుర్ జలపతి, సోయం జంగు, గొడం రేణుక, పెందుర్ పుషనిరాణి, సోయం లలితాబాయి తదితరులు పాల్గొన్నారు.

## మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల విజేత రాహుల్



పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త: గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలలో రాహుల్ విజేతగా నిలిచాడు. మాజీ మిస్టర్ ఇండియా టైటిల్ విన్నర్ రవికుమార్ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని అథ్లెటిక్స్ స్టేడియంలో మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ 2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో క్రీడాకారుడు రాహుల్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ టైటిల్ విన్నర్‌గా నిలిచి 50వేల రూపాయల నగదును సొంతం చేసుకున్నాడు. దీంతో పాటు సీనియర్ మిస్టర్ ఇండియా టైటిల్‌ను 55నుంచి 100కిలోల కేటగిరీల్లో నిర్వహించగా, ప్రతికేటగిరిలో ముగ్గురిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు మిస్టర్ ఇండియా పోటీల్లో తెలంగాణ తరపున పోటీ పడనున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 120మంది ఈ క్లాసిక్, బాడీ బిల్డింగ్ 2024 పోటీలలో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి, అన్మూల్ గ్రూప్ ఛైర్మన్ మహ్మద్ సల్మాన్, సామాజిక కార్యకర్త ప్రశాంత్‌కుమార్, సంతోష్ అగేరు. రామ్ తాళ్లూరి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## మా తాతల నుంచి వారసత్వంగా ఈ భూమి వచ్చింది

**– ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా కూలుస్తారు?**

**– అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం**



గండిపేట మండలంలోని సికిందర్‌గూడలోని భూమి మా తాతల నుంచి మాకు వారసత్వంగా వచ్చిందని పేర్కొంటున్న బాధితులు

నార్సింగి, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం సికిందర్‌గూడ సర్వే నెంబర్లు 14,15,16. లలోని 15.ఎకరాల భూమి మాకు మా తాతల నుంచి వారసత్వంగా వచ్చిందని బాధితులు మొయిజుద్దీన్ ఖాన్, అన్వర్‌ఖాన్, అబ్దుల్ రహ్మాన్ ఖాన్‌లు పేర్కొన్నారు. దశాబ్దాల నుంచి ఈ భూమిపై మేమే కబ్జాలో ఉన్నామని, చుట్టూ బౌండరీలు కూడా ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇటీవల మా కుటుంబ సభ్యులం కొంత మందిమి కలిసి భూమిని చదును చేసుకున్నామని, డ్రైనేజీ లైన్లు వేసుకుంటున్నామని తెలిపారు. 1950.నుంచి 2024.వరకు ఈ భూమికి సంబంధించి డాక్యుమెంట్లు అన్నీ మా వద్ద, రెవెన్యూ అధికారుల వద్ద, సిసిఎల్ఎలో ఉన్నాయని వివరించారు. సికిందర్‌గూడ సర్వే నెంబర్‌లు 1–19.వరకు మొత్తం 187.27.ఎకరాల భూమి మా తాతల పేర్లపైనే ఉండేదని, స్థానికులు కబ్జాలు చేసుకొని ఆక్రమించుకున్నారన్నారు. ఇప్పుడు మిగిలిన 15.ఎకరాల మా భూమిలో మేమే పొజిషన్‌లో ఉన్నామన్నారు. మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మా భూమిలో మేము నిర్మించుకున్న ప్రహరీనీ, నిర్మాణాలను బండ్లగూడ కార్పొరేషన్ అధికారులు కూల్చడం అన్యాయమన్నారు.



అనిల్‌కుమార్‌యాదవ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

## రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌కు స్వామి వారి చిత్రపటం అందజేత

**కొమురవెల్లి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రాజ్యసభ్య సభ్యునిగా ఎన్నికైన అనిల్‌కుమార్ యాదవ్‌కు కొమురవెల్లి దేవాలయ భక్తులు మంగళ వారం హైదారాబాద్‌లో కలిసి శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం పక్షాన స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

## తైక్వాండో పోటీల్లో విజయం సాధించి సిద్దిపేటకు జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలి

### జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ



పూజను అభినందిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఇటీవల హైదారాబాద్ బిహెచ్ఈఎల్ జరిగిన థర్డ్ ఫేస్ కేలో ఇండియా ఫస్ట్ తైకా ్వండ సెలక్షన్ లీగ్‌లో సిద్దిపేట జిల్లా తైక్వాండో అసోసియేషన్ పట్టణానికి చెందిన విద్యార్థి కంతుల పూజ జూనియర్ విభాగంలో అండర్-42 కేజీల విభాగంలో విజయం సాధించారు. ఈనెల 27 నుంచి మార్చి 2 వరకు పాండిచ్చేరిలో జరిగే కేలో ఇండియా థర్డ్ ఫేస్ తైకా ్వండో పోటీలకు ఎంపికైన పూజను జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ, జిల్లా తైక్వాండో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వేలేటి రాధాకృష్ణశర్మ, ఉపాధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ కేలో ఇండియాకు సెలెక్ట్ అయిన పూజను అభినందించారు. ఈ సందర్భం గా జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ మాట్లాడుతూ పాండిచ్చేరిలో జరిగే తైకా ్వండో పోటీల్లో విజయంసాధించి సిద్దిపేటకు జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కంతుల రమేష్, జిల్లా తైకా ్వండో అసోసియేషన్ కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏసిపి బాలాజీకి సన్మానం



ఏసిపిని సన్మానిస్తున్న ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** ప్రజ్ఞాపూర్ ఆటో యూనియన్ నాయకులు మంగళవారం గజ్వేల్ ఏసిపి బాలాజీని కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆటో డ్రైవర్ల సమస్యల గురించి ఏసిపి దృష్టికి తీసుకువచ్చారు. ఏసిపి బాలాజీ స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సామరస్యంగా ఆటో డ్రైవర్ల సమస్యను పరిష్కరిస్తుందన్నారు. ఏసిపిని కలిసిన వారిలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మంగలి పాండే, చంద్రయ్య, నవీన్, రమేష్, సురేష్, లింగం తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : సిఐ




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**హుస్నాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** విద్యార్థులు చట్టాలతో పాటు సైబర్ క్రైం గురించి అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎర్రల కిరణ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సర్ సివి రామన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు, బాలికలకు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలతో పాటు సైబర్ క్రైం గురించి షీ టీమ్ బృధంతో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాలు, ఈవి టీజింగ్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సామాజిక మాధ్య మాలు, సైబర్ సెక్యూరిటీ, డయల్ 100 ప్రాముఖ్యత మైనర్ డ్రైవింగ్, సమాజ రుగ్మతలు, నేరాలు, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలు, ఆన్‌లైన్ మోసాలు, జరిగే నేరాలు అందులో పడకుండా తీసుకోవాల్సిన బాధ్యతలు, భరోసా సెంటర్లు, ఫోక్సో చట్టం, షీటీమ్ దాని ప్రాముఖ్యత, మానవ అక్రమ రవాణా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ లాంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. బాలికలు, మహిళలను రోడ్లపై వెళ్లేటప్పుడు అపహేళనగా మాట్లాడినా, ఉద్దేశ పూర్వ కంగా వెంటపడ్డా వెంటనే 100కు లేదా షీటీమ్ వాట్సప్ నెంబర్ 871 2667434, మహిళా పోలీస్ స్టేషన్ నంబర్ 8712667435 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యం గా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాయిత నారాయణరెడ్డి, పాఠశాల అధ్యాపకులు, షీటీమ్ డివిజన్ బృందం సైదయ్య, స్వప్న, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారస్తులు లైసెన్స్‌లు తీసుకోవాలి

### -మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** వ్యాపారస్తులు లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయడం చట్టరీత్యా నేరమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పేర్కొన్నారు. మంగళవారం మాట్లాడుతూ మున్సిపల్ పట్టణ దుకాణ యజమానులకు 2023-24 సంబంధించిన వృత్తి వ్యాపార లైసెన్స్‌లు తప్పనిసరి తీసుకోవాల్సి వుండగా కొందరు వ్యాపారులు నేటికీ తీసుకోకుండా వ్యాపారం నడుపుతున్నారని, వెంటనే లైసెన్స్‌లు తీసుకోవాలని, లేనిచో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని, ఇంటిపన్ను, నల్లా బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు.

### నేడు బడ్జెట్ సమావేశం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో 2024-25కు సంబంధించిన బడ్జెట్ బుధవారం ప్రవేశపెట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నర్సయ్య తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం ఉన్నందున పాలకవర్గం సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీరేణుకా ఎల్లమ్మ జాతర

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. గత రెండు రోజుల నుండి గజ్వేల్ పట్టణంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి బోనాల సమర్పణ, రేణుకా ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవం, బోనాలు, ఒడిబియ్యం సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సముదాయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా అమ్మవారి నామస్మరణతో మారుమ్రోగింది. పోతరాజుల విన్యాసం, శివసత్తుల జోష్యంతో పాటు జోగిని హారిక బోనం ఎత్తుకొని గజ్వేల్ పట్టణంలోని పలు వీధుల్లో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్ళారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పట్టణ గీతా కార్మిక సంఘం అధ్యక్షుడు రాజాగౌడ్ మాట్లాడుతూ గ్రామ దేవతలను పూజిస్తే అంతా మంచి జరుగుతుందని, రేణుకా



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న జోగిని హారిక, మహిళలు

ఎల్లమ్మ తల్లి ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని అన్నారు. లోక కళ్యాణార్థం ప్రతి సంవత్సరం వార్షికోత్సవ సంబరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు జంగం రమేష్‌గౌడ్, పంజాల రాజుగౌడ్, నక్క రాములుగౌడ్, అశోక్‌గౌడ్, నక్క రేగొండగౌడ్, లింగంగారి శ్రీనివాస్‌గౌడ్, జంగం వెంకట్‌గౌడ్, బలరాంగౌడ్, లింగంగౌడ్, రమేష్‌గౌడ్, దేవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌కి సన్మానిస్తున్న దృశ్యం

## బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కలాల శ్రీనివాస్

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** భారతీయ మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షునిగా సిద్దిపేటకు చెందిన కలాల శ్రీనివాస్ ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా రాణే పరిశ్రమ బిఎంఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ మంగళవారం కలాల శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎంఎస్ రాష్ట్ర అధ్యక్షునిగా కలాల శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ముద్దం రాజిరెడ్డి, జిల్లా కోశాధికారి కె.కొండల్ తదితరులు పాల్గొన్నారు.

## 5వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్



సంగాపూర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పర్యటించారు. ఈ సందర్భంగా సంగాపూర్‌లో డ్రైనేజీ సమస్యపై స్థానిక కౌన్సిలర్ శీర్ల శ్యామల మల్లేష్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఆంధ్ర బ్యాంక్‌లో ఘరానా మోసం

### రూ. 27 కోట్ల కుచ్చుటోపి...12 మంది రిమాండ్ : సిఐ నరేందర్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించి అప్పటి ఆంధ్రా బ్యాంక్‌లో 27కోట్ల రూపాయలను లోన్ రూపంలో పొంది బ్యాంక్‌కు కుచ్చుటోపి పెట్టిన 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపిన సంఘటన రామచంద్రాపురం పట్టణంలోని ఆంధ్ర బ్యాంక్‌లో చోటు చేసుకుంది. రామచంద్రాపురం పోలీసు ఠాణాలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సిఐ నరేందర్‌రెడ్డి ఇందుకు సంబం ధించిన వివరాలను వెల్లడించారు. 2016లో ఆంధ్ర బ్యాంక్‌లో పని చేస్తున్న మేనేజర్, లీగల్ టీమ్, బ్యాంక్ ఏజన్సీ, చాటెడ్ అకౌంట్ సభ్యులు కలిసి 15 కంపెనీలకు చెందిన వ్యక్తులకు బిజినెస్ కోసం రుణాలను తక్కువ విలువ గల స్థిర, చరాస్థుతలను అధిక వ్యాల్యూవేషన్ గా చూపి రుణం రూపంలో 27 కోట్ల రూపాయలను అందించారు. రుణం పొంది రుణాలకు సంబంధించి చెల్లింపులు 2 సంవత్సరాల వరకు సజావుగా నిర్వహించారు. బ్యాంక్ ఇంటర్నల్ అధికారులు ఆడిట్ చేయగా అసలు విషయం బయటపడిందన్నారు. 2021లో రామచంద్రాపురం పోలీసు ఠాణాలో ఇందుకు సంబంధించి కేసు నమోదు కాగా విచారణ నిర్వహించారు. రుణంకు సంబంధించి అవకతవకలకు పాల్పడిన 12 మందిని మంగళవారం అరెస్టు చేసి సంగారెడ్డి కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు సిఐ నరేందర్‌రెడ్డి వివరించారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు

### -డిడిఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారీ

**కొడంగల్, ఫిబ్రవరి 20ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి, దూప దీప నైవేద్య అర్చకుల రాష్ట్ర కార్యవర్గానికి సంఘం జిల్లా అధ్యక్షులు లోకూర్తి జయతీర్థాచారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతు వేతనాలు అం^డం లేదని మంగళవారం ఛలో సెక్రటేరియేట్ కార్యక్రమం నిర్వ హించ తలపెట్టగా సోమవారం దేవాదాయ శాఖ అధికారులు డిడిఎన్ఎస్ అర్చక రాష్ట్ర కార్యవర్గంతో జరిపిన చర్చల్లో అర్చకు ల వేతనాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే మంగళవారం సాయంత్రం అర్చకులకు తమ ఖాతాల్లో వేతనాలు పడినట్లు సమాచారం అందంతో హర్షం వ్యక్తం చేశారు. ఇందుకుగాను ముఖ్యమంత్రి ఎనుముల రేవం త్‌రెడ్డి, డిడిఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు దౌల్తాబాద్ వాసుదేవశర్మ, దేవాదాయ శాఖ కమీషనర్‌కు, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఈ సందర్భంగా అర్చక సంఘం సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఆధునిక వ్యవసాయ విత్తనోత్పత్తి పద్ధతులపై శిక్షణ

**తాండూరు టౌన్ ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** తాండూరులో విత్తన పరిశోధన ,సాంకేతిక విభాగం, రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో వివిధ పంటలలో ఆధునిక వ్యవసాయ విత్తనో త్పత్తిపద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని వ్యవసాయ పరిశోధన తాండూరు అధిపతి సుధారా ణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పంట వివిధ దశాలలో బెరుకు లు, కేలిలను గుర్తించి తీసి వేయడం ద్వారా జన్యుపరమైన స్వచ్ఛతను కాపాడుకోవచ్చని సూచించారు. బ్రీడర్ విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానాల నుండి సేకరించి ప్రత్యేక మెలకువలు పాటించి తద్వారా రైతు తమ పోలలోనే వితనోత్పత్తి చేసి స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయవచ్చని వివరించారు. వ్యవసాయం పరిశోధన స్థానం ప్రధాన శా స్త్రవేత్త డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ....నల్ల రేగడి భూములలో కంది పంటను జంటసాళ్ల పద్ధతిలో సాగు చేయడం ద్వారా నాణ్యమైన విత్తనాన్ని అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. విత్తన ఉత్పత్తిలో ప్రధాన పొలం ఎంపిక, నాణ్యమైన విత్తన సేకరణ కేలీల ఏరివేత ఏర్పాటు దూరం పాటించడం ద్వారా నాణ్యమైన విత్తనాన్ని తయారు చేసుకుని అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రుద్ర మూర్తి, శాస్త్రవేత్తలు స్వర్ణలత, సుకుమార్, ప్రభావతి, సుజాత, రాజేశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

## ఘనంగా రేణుకా ఎల్లమ్మ మహోత్సవం

**గజ్వేల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** గజ్వేల్ పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా శ్రీరేణుకా ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మైనార్టీ నాయకులు అజ్గర్, పద్మశాలి సంఘం యువజన అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌లు అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జంగం రమేష్‌గౌడ్, పంజాల రాజుగౌడ్, శ్రావణ్ ఉన్నారు.

## సాగు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి

### ఎంపిటీసిల ఫోరం రాష్ట్ర నాయకుడు దేవి రవీందర్

**కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**



మాట్లాడుతున్న దేవి రవీందర్

తపస్‌పల్లి రిజర్వాయర్ నుండి సాగు నీటిని విడుదల చేసి పొలాలు ఎండిపోకుండా చర్యలు తీసుకొని రైతులను అధుకోవాలని వైస్ ఎంపిపి, ఎంపిటీసిల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కొండపాక ఎంపిడిఓ కార్యాలయంలో మాత్‌పల్లి తాజా మాజీ సర్పంచ్ బచ్చలి మహిపాల్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ తపస్‌పల్లి రిజర్వాయర్ నుండి సాగు నీటిని విడుదల చేసి కొండపాక, చేర్యాల, నంగునూరు, కొమురవెల్లి మండలాల రైతులు వేసిన వరి పంట లను ఎండిపోకుండా చూడాలని కోరారు. ఎండలు ముదరడంతో భూగర్భ జాలలు అడుగంటిపోయి బోర్ల నుండి నీరురాక చెరువుల్లో నీరులేక బోర్లు ఎండిపోయి పంటలు సైతం ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆయన ఆవే దన వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టె రైతన్నకు పంట పొలాలు ఎండుతుండడంతో కన్నీళ్లే మిగిలే పరిస్థితులు ఎర్పాడ్డయని, పంటలు పొట్టకొచ్చె సమయంలో సాగు నీరు అందక రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కాలువాల ద్వారా చెరువులు నింపి రైతులను అదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర తైక్వాండో జనరల్ సెక్రటరీగా ప్రభాకర్ గౌడ్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి20, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ గౌడ్ ఎన్నికైనారు. మంగళవారం గద్వాల్‌లో నిర్వహించి న ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా శరత్ చంద్ర, తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుండి ఎన్నికల పరిశీలుకుగా అచ్చుత్ రెడ్డి హాజరైయ్యారు. దశబ్దాలుగా శిక్షణ ఇస్తున్నా ఆయన ఎన్నిక పట్ల వికారాబాద్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల తైక్వాండో అసోసియేషన్ సభ్యులు స్వామి, మురారి, వెంక టేష్, రవి, మహేష్, శేఖర్, సవీద్, అభిమానులు, అభినందించారు.

## మొండిగౌరెల్లిలో డ్రోన్ పోర్టు ఏర్పాటు స్థలం పరిశీలన

**యాచారం ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :**

యాచారం మండల పరిధిలోని మొండి గౌరెల్లి గ్రామంలో ఇబ్ర హీంపట్నం ఆర్డీవో యాచారం తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. డ్రోన్ పోర్టు ఏర్పాటుకు అవసరమయ్యే 20 ఎకరాల స్థలాన్ని ఆర్డీవో అనంతరెడ్డి ,మండలంలోని మొండి గౌరెల్లి రెవెన్యూ పరిధిలోని 19వ సర్వే నెంబర్‌ను స్థానిక ఎమ్మార్వో అయ్యప్పతో కలిసి పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ పైలెట్లకు శిక్షణ ఇచ్చేం దుకు స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు.

## గ్రామాల అభివృద్ధికి జిల్లా పరిషత్ నిధులు

### -మేడ్చల్ జడ్పిటిసి శైలజా విజయనందరెడ్డి

**మేడ్చల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :**

శ్రీరంగవరం గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేసి ఆదర్శ గ్రా మంగా తీర్చిదిద్దామని మేడ్చల్ జడ్పిటిసి శైలజా విజయనం దరెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ విజయనందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ, అంబేద్కర్, గాంధీ విగ్రహన్ని జడ్పిటిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడ్చల్ మండలంలోని వివిధ గ్రామాల్లో అవసరమగు చోట జిల్లా పరిష త్ నిధులను వెచ్చించి అభివృద్ధి చేశామని తెలిపారు. గ్రామాల మౌళిక వసతుల ఏర్పాటుకు పాటుపడినట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్‌ను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**ధారూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని కొత్తగా నిర్మించిన అరుణ హాస్పటల్‌ను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మంగ ళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..మండల కేంద్రంలో హాస్పిటల్ ప్రారంభించడం శుభ పరిణామమని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల న్నారు. ఈసందర్భంగా హాస్పటల్ యజమాన్యం స్పీకరు ు సన్మా నించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అసోసియేషన్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి రాములు, డాక్టర్ పుష్ప ,డాక్టర్ భవిత, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డికి సన్మానం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

మూడుచింతలపల్లి మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకట నర్సింహ్మారెడ్డిని మూడుచింతలపల్లి గ్రామ మాజీ సర్పంచు జామ్ రవి, గ్రామ ఎంపిటిసి సభ్యుడు పి.నాగ రాజు, పలువురు నాయకులు సన్మా నించారు. మూడుచింతల పల్లి మండల కార్యాలయంలో తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డిని వారు సన్మానించి స్వాగతించారు. మాజీ సర్పంచు జామ్ రవి, ఎంపిటిసి సభ్యుడు పి.నాగరాజు, పలువురు నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగ కలిసి సన్మానించారు. ఆ తరు వాత మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి.నర్సింలుయాదవ్, మాజీ సర్పంచు పి.బాల నర్సింహ, కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మరి కొందరు నాయకులు కలిసి నూతన తహసీల్దార్ వెంకటనర్సింహ్మారెడ్డిని సన్మానించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

## భక్తులకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న

**హుస్నాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లో జరిగే సమ్మక్క సారక్క జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న సూచించారు. మంగళవారం రోజున పట్టణ శివారులో జరిగే జాతర ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్యంతో పాటు భక్తులకు నీటి సౌకర్యం గురించి పలు సూచనలు చేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగవద్దని, జాతర ప్రదేశంలో పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు పున్న లావణ్య సది, గోవిందు రవి, వల్లపు రాజు, మ్యాదరబోయిన వేణుయాదవ్, మాజీ ఎంపిపి ఆకుల వెంకట్, నాయకులు వాల నవీన్‌రావు, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల ఎల్లం, తదితరులు పాల్గొన్నారు.

### సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లు నమస్తే స్కీంలో సభ్యత్వం కలిగి ఉండాలి...

**హుస్నాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లు, వర్కర్లు నమస్తే సీ ్కంలో సభ్యత్వం కలిగి ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లకు నమస్తే స్కీంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ కార్మికులు అందరూ మున్సిపాలిటీ తరుపున లైసెన్సులు తీసుకో వాలని పనిచేసే సమయంలో పిపిఈ కిట్లు ఖచ్చితంగా ధరించాలన్నారు. నమస్తే స్కీంలో సభ్యత్వం తీసుకోవడం ద్వార ఋణాలు, సబ్సిడి కింద నూతన వాహనాలు కొనుగోలు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకా శాన్ని సెప్టిక్ ట్యాంక్ ఆపరేటర్లు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు వెళుతున్నార.. జరభద్రం

### తాళాలున్న ఇంటికే కన్నాలు వేస్తున్న దొంగలు

### జాగ్రత్తపడాలని హెచ్చరిస్తున్న పోలీసులు

**చేర్యాల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రోజు రోజుకు దొంగలు రెచ్చిపోతు న్నారు. తాళాలున్న ఇండ్లకె దొంగలు కన్నాలు వేస్తున్నారు. వేసవి కాలం వస్తుంది అందులో జాతర్లు, ఊర్లలోకి వెళ్ళినవారు ఫోటోలు దిగి సోషల్ మీడియాలో పోస్టులు చేయడంతో దొంగలకు పలానా ఊర్లో వాళ్ళు పలాన దగ్గరకు వెళ్ళారని గమనించి చోరీలకు పాల్పడే అవకాశం ఎక్కువ ఉందని పోలీసులు తెలుపుతున్నారు. ఇళ్ళకు తాళాలు వేసి ప్రయాణాలు చేసే వారు తాళాలు ఇంటి కిటికీలు, చెప్పుల స్టాండు, డోర్ మ్యాట్ వద్ద పెడితే మోస పోవడం తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నమ్మకస్థులకు సమాచారం ఇచ్చి అలాగే ఆ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసు అధికారులు తెలుపుతున్నారు.

### విలువైన వస్తువులను లాకర్లలో పెట్టుకోవాలి : సిఐ

ఊర్లలోకి వెళ్లే ముందు ప్రజలు విలువైన బంగారం, వెండి ఆభరణాలు, డబ్బులు బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని సిఐ లక్కెపురం శ్రీను తెలిపారు. నేను సైతం అనే కార్యక్రమం ద్వారా ఎవరికి వారే ఇండ్లలో, షాపుల్లో కాని సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకుని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకోవాలని సూచించారు. ఎవరైనా కాలనీలో అనుమానస్పదంగా కనిపిస్తే ఆ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు గాని 100 డయల్‌కు గాని సమాచారం ఇవ్వాలన్నారు. ఈ మధ్య కాలంలో దొంగతనాలు ఎక్కువ జరుగుతున్నా యని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## చౌదరిపల్లిలో విద్యార్థుల స్వయం పరిపాలన



స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

**వర్గల్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం చౌదరిపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినో త్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు తమదైన శైలిలో విద్యాబోధనచేసి ఆకట్టుకున్నారు. డీఈఓగా నవ్యశ్రీ, డిప్యూటీ డీఈఓగా పి.మణి తేజ, ఎంఈఓగా మైత్రి, ప్రధానోపాధ్యాయురాలిగా ఎన్.శ్రావణితో పాటు మరి కొంత మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా తమ విధులు నిర్వ హించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐ.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు జె.శ్రీనివాస్, ఎల్.బుచ్చిరాములు, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశిధర్‌శర్మ, ఎస్.భారతి, వి.శ్రీపాల్‌రెడ్డిలు పర్యవేక్షించారు. అనంతరం మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమొంటోలతో పాటు బహుమతులను అందజేశారు.

## మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత

**బెజ్జంకి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో నూతనంగానిర్మించిన శివాలయ ప్రారంభోత్సవ అహ్వాన పత్రికను అలయ కమిటీ సభ్యుల అధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎంపిపి లింగాల నిర్మలను మర్యాదపూర్వకంగా కలిసి అలయ ప్రారంభో త్సవ అహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్ రెడ్డి, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## బీసీ కుల గణన తీర్మానం చారిత్రాత్మక నిర్ణయం

**బెజ్జంకి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** బీసీ కుల గణన ఏకగ్రీవ తీర్మాణం ఒక చారిత్రాత్మక నిర్ణయమని మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కరవేణి పోచయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన నిర్వహించడం వల్ల బడుగు బలహీన వర్గాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అలాగే రిజర్వేషన్లు పెరెగుతాయన్నారు. కుల గణన నిర్వహించే బిల్లును అమోదించినందుకు సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్

**కొండపాక, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త**

తండ్రి జ్ఞాపకార్థం పదవ తరగతి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్న కుమారుడు. మంగళవారం కొండపాక బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ నర్రా భాస్కర్‌రెడ్డి తన తండ్రి రఘుపతి జ్ఞాపకార్థం పదవ తరగతిలో ప్రత్యేక క్లాస్‌లకు హాజరైతున్న విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ అందిస్తునట్లు అయన తెలిపారు. పదవ తరగతిలో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడానికి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్లాస్‌లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాత్రి 7 గంటల వరకు క్లాస్‌లో ఉండి అలసి పోకుండా స్నాక్స్ ఎంతో ఉపయోగపడతన్నారు.

## బూరుగుపల్లిలో మహిళ అత్మహత్య

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఆరోగ్య సమస్యలతో సత మతమవుతూ మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన సక్కుబాయి అత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. సోమవారం పురుగుల మందు తాగిన మహిళను స్థానికులు సిద్దిపేట ప్రైవేటు అసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగానే మంగళవారం మధ్యాహ్నం అమె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## పండరిపూర్‌లో వాటర్‌ప్లాంట్ ప్రారంభం

**సిర్గాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని అంతర్గాం గజంద్ర మోక్ష ఆశ్రమం పీఠాధిపతి శ్రీకరణ్ గజేంద్ర భారతి మహారాజ్ ఆధ్వర్యంలో పండరీపూర్‌లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, వంటశాల గదిని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి జుక్కల్ ఎమ్మెల్యే గంగారం, డిసిసిబి మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ శ్రీకరణ్ గజేద్ర భారతి మహారాజ్ సేవలు తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటకలో భక్తులు మార్గదర్శనంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్య దర్శి చంద్రశేఖర్‌రెడ్డి, పాండురంగ స్వామి భక్తులు వెంకట్‌రామ్‌రెడ్డి, సంజీవులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎల్ఆర్‌లో సైన్స్ ఫెయిర్



సైన్స్ ఫెయిర్ తిలకిస్తున్న ఆర్ఎల్ఆర్ చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి

**జహీరాబాద్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** పట్టణంలోని డాక్టర్ ఆర్ఎల్ ఆర్ పాఠశాలలో మంగళవారం అకడమిక్ ఫెయిర్ ప్రారంభోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలలో నర్సరీ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఆయా అంశాలపై వారి వారి నమునాలను ప్రద ర్శించారు. పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను తిలకించేందుకు పోషకులతో పాటు పట్టణ వాసులు హాజరై విద్యార్థులు ప్రదర్శించిన 420 ప్రాజెక్టును ఆకస్తిగా పరిశీలించారు. పరిశీలకులకు విద్యార్థులు తమ ప్రాజెక్టులపై వివరించారు. విద్యార్థుల ప్రాజెక్టులను ఆర్ఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ లక్ష్మారెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించి విద్యార్థులను అభినందించారు.

## న్యాల్‌కల్ జాతరలో కుస్తీ పోటీలు



జాతరలో విజేత మల్లయోధుడికి బహుమతిని అందచేస్తున్న దృశ్యం

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కొండ గట్టుపై శుక్రవారం నుంచి కొనసాగుతున్న హజ్రత్ పీర్‌గైబ్ సాహెబ్ జాతర ఉత్సవాల్లో మంగళవారం కుస్తీపోటీలు నిర్వహించారు. జాతరలో నిర్వ హించే కుస్తీపోటల్లో తలపడేందుకు కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని ఆయా ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పడుతూ ఉంటారు. కుస్తీపోటీలను తిలకించేందుకు ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకుని కేరింతలు కడుతూ మల్లయోదులను ఉత్సాహ పరిస్తూ పోటీలను తిలకించడం ఆనవాయితీగా మారింది. కుస్తీ పోటల్లో కొల్హాపూర్‌కు చెందిన లింగరాజ్ విజేతగా నిలువగా మండలంలోని ముంగి గ్రామానికి చెందిన సయ్యద షకీల్ 20వేల 50రూపాయల నగదును బహుమతిని అందించి అభినందిచారు. కార్యక్రమంలో పంచాయితీ కార్య దర్శి రోహిత్ కులకర్ణి, మాజీ సర్పంచ్ శివశంకరయ్యస్వామి, జాతర కమిటి అధ్యక్షులు యునూస్ ఖాన్, నాయకులు పడకంఇ వెంకట్, అడివప్ప, భద్రుస్వామి, శివస్వామి, గొల్ల నర్సింలు, గొల్ల జగన్నాథ్, బొల్లి శ్రీనివాస్, మహబూబ్ వాహబ్, మహమూద్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

-కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్ సింధూ



మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** భారతీనగర్ డివిజన్ పరిధిలోని మాక్స్ సొసైటీ కాలనీకి వెళ్లే దారిలో భేల్‌స్థలం దుర్గంద భరితం గా మారిందని కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో కార్పోరేటర్ మాట్లాడుతూ భేల్ స్థలంలో రోడ్డుకు ఇరువైపుల చెత్తాచెదారం పేరుకుపోయిందని, దుర్గంధభరితంగా ముక్కుపుటలదిరేలా దుర్వాసన వెదజల్లుతోందని పేర్కొన్నారు. గతంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో శుభ్రం చేయించినా ఫలితం లేకుండా పోయిందని, భేల్ యాజమాన్యం తో చర్చించి పరిశుభ్రతకు తగు చర్యలు తీసుకోవాలని, శాశ్వత పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని సభలో కార్పోరేటర్ వివరించారు. డివిజన్ పరిధిలో రెండు మాసాల నుంచి గార్బేజ్ టిప్పర్‌లను తగ్గించడం జరిగిం దన్నారు. గ్రీన్ వేస్ట్ వాహనం రాంకీ వారిచే మరో వాహనం ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుధ్య కార్మికుల కొరత ఉంని, కొత్త శానిటేషన్ గ్రూప్స్‌ను మంజూరు చేయాలని కౌన్సిల్‌కు వినతి చేశారు.

## గుండె ఆరోగ్యపై విద్యార్థులకు అవగాహన

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** గుండె ఆరోగ్యంపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. మండలంలోని మెటల్‌కుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సిపిఆర్‌పై అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ సిఆర్‌పి చేసే విధానాన్ని, ఫలితంగాదక్కే ప్రయోజనాలపై వివరంగా విద్యార్థులకు వివరిం చారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

# బిజెపి విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

బిజెపి రాష్ట్ర కార్యదర్శి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

**నర్సాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి అధికారం చేపడుతుందని, మూడోసారి నరేంద్రమోడి ప్రధానమంత్రి కావడం ఖాయమని, మెదక్ పార్లమెంట్‌పై కాషాయం జెండా ఎగుర వేస్తామని బిజెపి రాష్ట్ర కార్యదర్శి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో బిజెపి నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ఏ పార్టీతో పొత్తు లేకుండా ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాల్లో అధిక స్థానాలు బిజెపి కైవసం చేసుకుంటుందన్నారు. బిఆర్ఎస్ బిజెపి పొత్తు కుదుర్చుకుంటుందని కొన్ని మీడియా సంస్థలు బిజెపిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా మారిన కొన్ని చానల్ల ఈ తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని తెలిపారు. వాటిని ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బిజెపి అధ్వర్యంలో విజయ సంకల్పయాత్రను నిర్వహిస్తుందని తెలిపారు., ఈ విజయసంకల్ప యాత్రలో భాగంగా రాజరాజేశ్వరి బస్సుయాత్రను ఈ నెల 24 న సాయంత్రం నర్సాపూర్‌పట్టణానికి చేరుకుంటుందని తెలిపారు. అయితే 25 న నర్సాపూర్‌లో బిజెపి అధ్వర్యంలో భారీ భహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అటుతర్వాత నర్సాపూర్ నుండి గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, రామాయంపేట్, చేగుంట తదితర ప్రాంతాలతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ బస్సుయాత్ర పర్యటిస్తుందని తెలిపారు. కాగా ఈ నెల 27 న మెదక్ లో కూడ భారీ భహిరంగ సభను నిర్వమిస్తున్నామని తెలిపారు. ఈ రాజరాజేశ్వరి బస్సు యాత్రలో బిజెపి నాయకులు, కార్యకర్తలు అదిక సంఖ్యలో పాల్గొని విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని రఘునందన్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, మెదక్ పార్లమెంట్ ప్రభారి బసవ లక్ష్మినరసయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీయాదవ్, కర్ణం పరిణీత, నాయకులు ఆకుల రాజయ్య, నందరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గోడ రాజెందర్, జీవన్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ సంగమేశ్వర్, పంజా విజయ్‌కుమార్, మెదక్ అసెంబ్లీ ప్రభారి ధర్మ, కౌన్సిలర్ బుచ్చేష్‌యాదవ్, సంగసాని సురేశ్, ఎరుకలి యాదగిరి, నియోజకవర్గ అసెంబ్లీ కో కన్వీనర్ సతీష్‌యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి కొత్త శ్రీనివాస్‌గుప్త, మాజీ సర్పంచ్ హెచ్ వి. రమణారావు, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, శక్తి కేంద్రం ఇంచార్జీ బోర్‌వెల్ రామ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య, సోషల్ మీడియా కన్వీనర్ సందీప్, శ్రీకాంత్, భరత్, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రేణుకామాత ఆలయంలో పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

## రేణుకా మాత విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**హవేళిఘనపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో ఐదురోజులపాటు జరిగే నూతన ఆలయ నిర్మాణం ప్రారంభో త్సవంలో భాగంగా శ్రీ రేణుకా మాత నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలతో పాటు మంగళవారం బూర్గు గ్రామ మహిళల బోనాల కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమెమల్యే పద్మాదేవేందర్‌రెడ్డి కార్య క్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు రామిరెడ్డి, చెన్నగౌడ్, నాయకులు సాప సాయిలు, మేకల సాయి, బాలరాజ్, సిద్దగిరి గౌడ్, స్వామిగౌడ్, సురేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## భవిష్యత్‌లో కృత్రిమ మేథదే కీలకభూమి

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** భవిష్యత్తు సాంకేతికతో కృత్రిమ మేథ(ఏఐ) కీల భూమిక పోషించబోతుందని, విద్యార్థి దశ నుంచే దానిపై పట్టు సాధించాలని నెక్స్ వేవ్ గ్రోత్ మేనేజర్ ప్రశాంత్ ఏఆర్ సృష్టికరించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కోగాన్(సాంకేతిక మెళకువులను ప్రోత్సహించే విద్యార్థి విభాగం) మంగళవారం నిర్వహించిన ఒకరోజు జనరేటివ్ ఏఐ వర్క్ షాప్‌లో ఆయన ప్రధాన వక్త, శిక్షకుడిగా పాల్గొన్నారు. గీతమ్‌లోని స్టూడెంట్ లెఫ్ట్, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఏఐఈఎస్ఈసీల సంయుక్త సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యశాలలో వివిధ రంగాలలో కృత్రిమ మేథ సాధనాలు, వాటి వినియోగంఐ సమగ్ర అవగాహన కల్పించేం దుకు ప్రయత్నించాడు. ఏఐ టూల్స్, ఆచరణాత్మక అభ్యాసం, చాట్ జీపీటి వంటి వాటిపై ఆయన గీతం విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించారు. వేగవంతమైన వృద్ధి, మంచి సామర్థ్యాన్ని సమకూర్చుకోవడం కోసం కృత్రిమ మేథ సాధనాల వినియోగంపై విద్యార్థిగా ఉన్నప్పటి నుంచే పట్టు సాధించా లని, ఆయన సూచించారు. వాటి జీపీటీ, సూపర్ చార్జ్ కంటెంట్ క్రియేటర్, సర్రెక్సిటి ఏఐ దాల్-ఈ డ్రీమ్ వార్ప్, రన్ని ఎంఎల్, పోరా, క్లిప్ చామ్ వంటి పలు రకాల, కృత్రియ మేథ సాధనాలను గీతం విద్యార్థులకు ప్రశాంత్ పరిచయం చేశారు. అలాగే ఫ్రిమర్, హోస్టింగర్ వంటి ఏఐ సాధనాల గురించి కూడ ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ సాధనాల గురించి మంచి అవగాహన ఏర్పరచుకొని, వాటిపై ఆవరణాత్మక ప్రయోగాలు చేయాలంటూ వారిని ప్రోత్సహించారు. కార్యశాలలో విద్యార్థులు, కృత్రిమ మేథ, సాంకేతికత భవిష్యత్తు, వివిధ పరిశ్రమలలో దాని వినియోగం వంటి అంశాలపై విద్యార్థులు లోతైనఅవగాహనను ఏర్పరచుకున్నారు. వాటిపై మరింత అవగాహన ఉత్సుకతను పెంపొందించడానికి ప్రశాంత్ కొన్ని విడియోలు చూపుతూ, వాటిపై లోతుగా ఆలోచించి, ప్రశ్నలు, అడిగేలా విద్యార్థులు ప్రోత్సహించారు.

## కుటుంబ సభ్యులను పరామర్శించిన శ్రీనివాస్

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండలంలోని కేశ్వర్ గ్రామానికి చెందిన రాజు నానమ్మ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న టిపిసిసి సభ్యులు కే శ్రీనివాస్ మంగళవారం కుటుంబ సభ్యులను పరా మర్శించారు. మంగళవారం కేశ్వార్ గ్రామానికి నాయకులతో కలిసి చేరుకుని రాజు కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. రాజు నానమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, హన్మండ్లు, సంజీవ్ పాటిల్, చందు పాటిల్ తదితరులు ఉన్నారు.



స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధి ధర్పల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాల, సూరారంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యా ర్థులు మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకు న్నారు. డీఈవోలుగా బాబు, రాకేష్, ప్రధానోపాధ్యాయులుగా రుచిత, కీర్తన, ఎంఈవోగా జితేందర్, ఉపాధ్యాయులుగా శిరిష, లలిత, విగ్నేష్, భాగ్య, ఆకాంక్ష, రమ్య, సతీష్, హేమంత్, అర్చన, సానిచ, పూజ, ప్రవిణ్‌లు వ్యవహ రించారు. పాఠం బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల ప్రధానో పాధ్యాయులు శ్రీనివాస్, సాయిరెడ్డిలు వారికి బహుమతులు అందించారు.

## ఘనంగా స్వయం పాలన



ఘనపూర్ గ్రామంలో స్వయం పాలనలో పాల్గొన్నన్న విద్యార్థులు

**కొల్చారం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధి చిన్న ఘణపూర్ గ్రామంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవం విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా డిఈవోగా రాణి, ఎమ్ఈవోగా జె.శైలజ, పీఈటిగా సిహెచ్ మహేందర్, ఉపాధ్యాయులుగా చందు, శైలజ, నాగరాణి, లక్ష్మణ్, కిరణ్, వేణు, ఫర్జాణా, భార్గవి, సిహెచ్ నవీన్, కే.నవిన్, కె.సరస్వతి, తదితరులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎబాజ్ సుల్తానా మాట్లాడుతూ ఒక రోజులో ఉపాధ్యాయ వృత్తి, అనుభవం, పొందారని, ఈ పాత్ర పోషించుటకు ఎంత ఉత్సాహంతో ఇష్టపడి అభినయించారో అంతే శ్రద్దతో, ఇష్టపడి చదివితే మీకు బంగారు జీవితం ఉంటుందన్నారు. క్రమశిక్షనాయుతమైన విద్య, భావితరానికి పూనాది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సితారాములు, రమణ, సంగయ్య, సిద్దిరాములు, మహేష్, జరీనా, సుగుణ, మహేష్ తదితరులున్నారు.

## మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటాం

కాంగ్రెస్ నాయకులు

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బాచారం గ్రామానికి చెందిన గడ్డం భీమయ్య, గడ్డం ప్రభాకర్, అల్లాదుర్గం శ్రీకాంత్‌లు సోమవారం రాత్రి అల్లాదుర్గం మండల పరిధిలోని గడిపెద్దాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కానరాని లోకాలకు చేరిపోయారు. బచారంలో మంగళ వారం సాయంత్రం నిర్వహించిన అంతక్రియల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, మండల అధ్యక్షులు గోవింద్ నాయక్, ఎంపిటిసి సభ్యులు శ్రీని వాస్, కో-ఆప్షన్ సభ్యులు గౌస్ పాషా, ముశెట్టి కిష్టయ్య, నరేందర్‌గౌడ్‌లు పాల్గొని మృతులకు కన్నీటి వీడ్కోలు పలికారు. మృతుల కుటుంబాలు నాయకులు పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామి చేశారు.

# ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు : మైనంపల్లి



మాట్లాడుతున్న మైనంపల్లి హనుమంతరావు

**హవేళిఘనపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలను మెదక్, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మంగళవారం హవేళిఘనపురం మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో నూతన ఆలయ నిర్మాణం, అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఐదు రోజుల రేణుకా ఎల్లమ్మ పండుగ కార్యక్రమంలో భాగంగా విగ్రహ్ ప్రతిష్ట మరియు బోనాల ఊరెగింపు కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. మండలంలో బూరుగుపల్లి గ్రామంలో బారీ ఖర్చుతో ఆలయ నిర్మాణం చేపట్టి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించడంతో గౌడ కులస్తుల సహకారంతో విగ్రహ ప్రతిష్ట జరుపడం, గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఐదు రోజుల పండుగను పురస్కరించుకొని అమ్మవారి దర్శనం కోసం చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి కళ్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. బూరుగుపల్లి గ్రామంలో రేణుక మాత అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ట వేద పండితులచే ప్రతిష్టాత్మక హోమము పూజలు చేసి కార్యక్రమాలు పూర్తి చేస్తామని, గ్రామంలో మృతి చెందిన కుటుంబాలను కుమ్మరి రాములు, సాయాగౌడ్, అల్లి భూపాల్ పరామర్శించారు. పక్షవాతంతో భాదపడుతున్న బాధితుడికి 50000 ఆర్థిక సహాయం అందిస్తానని తెలిపారు. గౌడ సంఘ సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షులు మంజుల, సిద్దగిరిగౌడ్, నాయకులు బాలకిషన్ రావు, మహేందర్‌రెడ్డి, ఆఫీస్ ఉద్దీన్ బొజ్జ పరశురాం గౌడ్, అశోక్ పంతులు, రామచంద్రరావు, శ్రీనివాస్, సురేష్‌గౌడ్, వెంకట్‌రాములు, డాక్టర్ యూ రాములు, రాజు, సాయిబాబ, ఎంఎస్ఎస్ఓ సభ్యులు సంగమేశ్వర్, లెంక రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**పిల్లలకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేత..**

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** తల్లితండ్రులును కోల్పోయిన పిల్లలకు మైనంపల్లి స్వచ్ఛంధ సంస్థ అండగా ఉంటుందని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల పరిధి వెంకట్‌రావుపల్లి, చెన్నాయిపల్లి గ్రామాలలో తల్లితండ్రులు కోల్పోయిన ఆరుగురు పిల్లలకు ఒక్కొక్కరికి రూ.25వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందించారు. ప్రాణం ఉన్నంత వరకు మైనంపల్లి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలలో ఫర్నిచర్ కావాలని గ్రామస్తులు అడుగగా, వేసవి సెలవులు పూర్తి అయ్యేలోపు ఫర్నిచర్ అందిస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పాండరిగౌడ్, అరుణ, మాజీ సర్పంచులు రాజిరెడ్డి, రంగారావు, శ్రీమన్నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగరాజు, సిద్దిరాములు, పవన్‌గౌడ్, రాంచందర్, చిరంజీవి, కోడూరి రమేష్‌గౌడ్‌లు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ నెల 21న విద్యుత్ సర ఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ అర్జున్ తెలిపారు. మండల పరిధిలోని హద్నూర్, చాల్కి, న్యాల్‌కల్, డప్పూర్ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, అందుకు వినియోగదారులు విద్యుత్ అధికారులకు తమ వంతు సహకారం అందించాలని ఏఈ అర్జున్ ప్రజలకు సూచించారు.

## జూనియర్ కళాశాలలో వీడ్కోలు సమావేశం

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్య ను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని పాపన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు అన్నారు. మంగళవారం కళాశాలలో ఇంటర్ మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యలక్ష్మి, శ్రీనివాస్, సంతోష్, జూలకంటి శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రమేష్, సంధ్యారాణి, అరుణ, విజయ్, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 27న గీత భూపాల్‌రెడ్డి కళాశాల వార్షికోత్సవం

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివి జన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీలోని గీత భూపాల్‌రెడ్డి జూనియర్ కళాశాలలో ఈ నెల 27వ తేదీన వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళ వారం కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతను స్థానిక కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేషన పరిశీలించారు. కళాశాల పరిసరా ల్లోని పిచ్చిమొక్కలను జిహెచ్ఎంసి సిబ్బంది, ఎంతమాలజీ సిబ్బందితో కార్పొరేటర్ పరిశుభ్రయం చేయించారు. వార్షికోత్సవ కార్యక్రమానికి అతి రథులు హాజరవుతున్నందున తగు ఏర్పాట్లు చేయిస్తున్నామన్నారు. కార్య క్రమంలో కాలనీ అధ్యక్షులు రాజు గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి, విఠల్ రెడ్డి, వీరశెట్టి, చక్రవర్తి, రమేష్ బాబు, లింగం, అంజయ్య, రజిని పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగ్సన్ పల్లి గ్రామానికి చెందిన శంకర్‌గౌడ్ ఇటీవల మృతి చెందగా బిఆర్ఎస్ నాయకులు ఏడుపాయల శ్రీనివాస్‌గౌడ్ మృతుడి కుటుంబానికి మంగళ వారం రూ. 5వేల ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు తోగిట శేఖయ్య, నాయకులు దండోళ్ల సామేల్, వార్డు సభ్యులు మతుకు మల్లేశం, తలారి నర్సింలు, పోలబోయిన నాగయ్య, భూపాల్, సుదర్శన్, సూర్యసింహ, పాలంచ రాములు, గుండు దుర్గయ్య పాల్గొన్నారు.

## ఆసుపత్రికి నోటీసు బోర్డు బహూకరణ

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండలంలోని కరస్‌గుత్తిలోని గ్రామంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంకు జగన్‌లాల్ జ్ఞాపకార్థం జగన్‌లాల్ కుమారుడు జైస్వాల్ నోటీసు బోర్డును అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్వప్న, సూపర్‌వైజర్ గురుస్వామి, మాజీ ఉప సర్పంచ్ ఇందమ్మ శివరాజ్, గ్రామస్థులు అమ్రేష్ గడ్డి విఠల్‌రెడ్డి సునీల్‌చారి, శివగడ్డే కృష్టారెడ్డి, దర్శన్ బాలజీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**నర్సాపూర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** విద్యార్థులు శ్రద్దగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రిసోర్స్ పర్సన్ సునీతరాకేశ్ అన్నారు. మంగళ వారం నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి గ్రామ సమీపంలోనున్న కెజిబివి పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భేటి బచావో, భేటి పడావో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిసోర్స్ పర్సన్ సునీతారాకేశ్ విద్యార్థు లకు పలు సూచనలు, సలహాలను ఇవ్వడం జరిగింది. చిన్న వయస్సులో బాల్యవివాహాలు చేసుకోకుండా బాగా చదువుకోవాలని ఆమె సూచించారు. చదువుతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగి శ్రద్దగా చదువుకొని సమాజంలో ఉన్నత వ్యక్తులుగా ఎదిగి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో సిడిపివో హేమాబార్గవి, కెజిబివి పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత, ఉమెన్ టీం కోఆర్డి నేటర్ సంతోషి, జెండర్ స్పెషలిస్ట్ కవిత, నాగమణి, ఫైనాన్సియల్ లిటరసీ రమేశ్, ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీవిల్స్‌తో రోడ్లు ధ్వంసం.. పట్టించుకోని అధికారులు

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఎన్నో లక్షలు వెచ్చించి రహదారులు నిర్మిస్తే సంవత్సరం కాకముందే రోడ్లన్ని పాడవుతు న్నాయి. నారాయణఖేడ్ నియోజకవర్గంలో మనూరు, నాగల్‌గిద్దా, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట మండలాలు ఉన్నాయి. ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి రోడ్లను ప్రజల సౌకర్యం కోసం రోడ్లు వేస్తుంటే అందులో కొందరు ట్రాక్టరు యాజమానులు పొలాల్లో పనులు చేయడానికి కేజీవీల్స్‌లో రోడ్లపై ఉపయోగించడంతో రోడ్లన్ని నాశనమవుతున్నాయి. నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావుపే, నిజాంపేట కల్హేర్, సిర్గాపూర్ మండలా ల్లో ఎక్కువగా వరి పంటలు పండిస్తుంటారు. వరిపొలాల్లో దుక్కి దున్నేం దుకు వరిసాగుకు ఎక్కువగా కేజీవీల్స్‌ను ఉపయోగిస్తుంటారు. అధిక శాతం రైతులు పొలాల్లో నాట్లు వేయాలన్న సొంత లేదా కిరాయి ట్రాక్టర్లను వినియోగిస్తుంటారు. పొలాలకు వెళ్లడానికి గ్రామాల్లోని సీసీ రోడ్లపైన నుంచే వెళ్లాల్సి ఉంటుంది. కాగా రహదారులపైన ట్రాక్టర్లు నడపడం వల్ల రహ దారులు ధ్వంసమవుతున్నాయి. రోడ్లపై కేజీవీల్స్‌ను నడిపితే ప్రభుత్వ పరం గా జరిమానా వేయాలి లేదా వాహనాన్ని సీజన్ చేయాలి కాని ఈ విషయంలో ఆయా శాఖల అధికారుల కళ్ల ముందు నుంచి వెళుతుంటే ఆయా శాఖల అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజల ఆవేదన. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తారు, సీసీ రహదారులపై కేవీవీల్స్ ట్రాక్టర్లు తిరగకుండా చర్యలు తీసుకుని రోడ్లను కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లక్షలు రూపాయలతో వేసిన రోడ్లన్ని ఆరు నెలల లోపే పాడవుతున్నాయని స్థానిక ప్రజలు తెలిపారు.



నారాయణఖేడ్ రహదారిపై కేజీవిల్స్‌లో దర్జాగా వెళుతున్న ట్రాక్టర్

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** చేపట వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రామతీర్థం గ్రామశివారులో మంజీరా నదిలో మంగళవారం జరిగింది. కుటుంబీకులు, గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కట్ట ప్రభు భార్యతో కలిసి హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. కొన్ని రోజుల క్రితం కట్ట ప్రభు స్వగ్రామమైన రామతీర్థంకు బావ వద్దకు వచ్చి ఉంటున్నాడు. సోమవారం గ్రామ శివారులోని మంజీరా నదిలో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదావశాస్తు నీటిలో మునిగి మృతి చెందాడన్నారు. రాత్రికి ప్రభు ఇంటికి చేరుకోకపోవడం తో చెరువు పరిసరాల్లో పరిశీలించగా చెరువులో ప్రభు నీటిపై తేలుతూ కనిపించాడన్నారు. పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి ఎస్ఐ నరేష్ చేరుకుని పరిస్థితిని సమీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

## అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

**పాపన్నపేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అప్పల బాధతో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అమ్రియాతండాలో సోమవారం జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం... అమ్రియా తండాకు చెందిన లునావత్ విజ్యా(30) భర్త దీప్లా మూడేళ్ల క్రితం విద్యుదాఘాతంలో మృతి చెందాడన్నారు. భర్త మృతితో కూలీ పనులు చేసు కుంటూ జీవనం సాగిస్తున్నదని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల చుట్టుముట్టడం తో అప్పులు చేయాల్సి వచ్చింది. చేసిన అప్పులు తీర్చే మార్గం లేక, రుణ దాతల వేధింపులు అధికంకావడంతో సోమవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగగా విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికత్స పొందుతూ మృతి చెందిందన్నారు. మృతురాలి కుమారుడు ప్రకాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ వివరించారు.